నేడు పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సాధారణ సమావేశంలో అజెండాలోని 15 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. అనంతరం జరిగే కాంట్రాక్ట్ కమిటీ సమావేశంలో నాలుగు అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, పథకాలపై చర్చిస్తారని తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధి రక్షణ కోసం ఉద్యమం

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వామపక్షాలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేయాలని చూస్తోంది. దీనిలో భాగంగానే పలు పనులను రద్దు చేసింది. పొమ్మనకుండా పొగ పెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. వ్యవసాయ కార్మికులే పనులు లేకుండానే రీతిలో బడ్జెట్లో భారీగా కోత విధిస్తోంది. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం నడుం బిగించింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్న పథకానికి బడ్జెట్లో నిధులు పెంచి మరింతగా బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తోంది. 'ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందాం రండి, కలెక్టర్కు చెప్పుకుందాం కదలండి' అంటూ పిలుపునిచ్చింది. నేడు కాకినాడ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు.

కాకినాడ జిల్లాలో రోజుకు సుమారు 90 వేల మంది ఉపాధి కూలీలు పనులకు వెళుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి చట్టం గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కష్టకాలంలో వారి పొట్ట నింపుకోవడానికి పనికొస్తోంది. ఈ నేపథ్యంలో మరింత సమర్థవంతంగా పథకాన్ని అమలు చేయాల్సిన బిజెపి ప్రభుత్వం చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తూ వస్తోంది. రెండు పూటలా కష్టించి పనిచేస్తే రూ.220 మించి కూలి రాని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల రూ.150 మించి రావడం లేదు. వంద రోజులు పని దినాలు కల్పన సక్రమంగా అమలు కావడం లేదు. సగటు వేతనం రూ.60 మించడం లేదు. భారీగా నిధులను తగ్గించి పలు సౌకర్యాలను పూర్తిగా రద్దు చేశారు. పని ప్రదేశంలో మండుటెండలో కనీసం టెంట్లు కూడా లేని పరిస్థితుల్లో కూలీలు చెరువు, కాలువ పూడికతీత తదితర పనులు సాగిస్తున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే గాయానికి కట్టు కట్టేందుకు కూడా కనీసం ఫస్ట్ ఎయిడ్ కిట్లను కూడా ఉంచడం లేదు. తాగునీరు, మజ్జిగ సరఫరా పూర్తిగా నిలిపివేశారు. సమ్మర్ అలవెన్సులకు మంగళం పాడారు. గతంలో వారానికి ఒకసారి పే స్లిప్పులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో ఎవరికి ఎంత వేతనం పడుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. మారిన నూతన సాఫ్ట్వేర్ ప్రకారం రెండుసార్లు ఫోటోలు తీయాల్సి ఉంటుంది. సాంకేతిక సమస్యల వల్ల గంటల తరబడి ఫోటో కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో అధికార పార్టీ నేతలు పనులకు రాకపోయినా అక్రమంగా మస్తర్లు వేసుకుంటున్నారు. ఇలా అనేక సమస్యలు ఉపాధి పథకంలో కొనసాగుతున్నాయి.

శంఖవరం మండలంలో కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్

విస్తృతంగా ప్రచారం

ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి ఉపాధి హామీలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురానున్నారు. భారీ సంఖ్యలో కూలీలు తరలి రానున్నారని వారు తెలిపారు. ఈ మేరకు 15 రోజులుగా జిల్లాలో అన్ని మండలాల్లోనూ విస్తృతంగా ప్రచారం చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లో పర్యటించిన నాయకులు ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై కూలీలకు వివరించారు.

సామర్లకోట మండలం వేట్లపాలెంలో కూలీలతో మాట్లాడుతున్న కెఎస్.శ్రీనివాస్

సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టుల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తమ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతూ కాకినాడలో సోమవారం జర్నలిస్టులు ధర్నా చేశారు. నిబంధనలు సడలించి అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలనే తదితర డిమాండ్లతో డిపిఆర్ఒ కార్యాలయం వద్ద ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు జర్నలిస్టులు ఈ నిరసనలో పాల్గొన్నారు. అనంతరంకలెక్టర్ కత్రికా శుక్లా, పౌర సంబంధాల శాఖ అధికారి నాగార్జునకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ రాజ్ మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని 9 డిమాండ్లతో కూడిన వినతిపత్రం కలెక్టర్కు అందజేశామన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు మున్నీ, వీధి గోపీనాథ్, పుర్రె త్రినాధ్, వల్లూరి నానాజీ, లక్ష్మణ్, సురేంద్ర, దాసరి శ్రీనివాస్, రెడ్డి నాయుడు బాబు, పలివెల శ్రీనివాస్, రవి, హస్సేన్, మదన్, విజయ్, సోనీ, వాసంశెట్టి శ్రీనివాస్, అప్సర, ప్రవీణ్, వాసు పాల్గొన్నారు.

డిపిఆర్ఒ కార్యాలయం వద్ద జర్నలిస్టుల ధర్నా

కలెక్టరేట్‌లో స్పందనకు 310 అర్జీలు

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. కతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరు కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కతికాశుక్లా, జెసి ఎస్.ఇలాక్కియ, ఇన్‌ఛార్జ్ డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, జెడ్‌పి సిఇఒ ఎన్‌వివి.సత్యనారాయణ, బిసి, ఎస్‌సి కార్పొరేషన్ల ఇడిలు ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, డిఎస్ సునీతతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 310 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 31న జెఎన్‌టియుకె స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు కాకినాడకు వస్తున్న సందర్భంగా సోమవారం కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా ఆయన పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. విసి జివిఆర్.ప్రసాద్ రాజు, ఎఎస్‌పి బి.సత్యనారాయణ, ఆర్ అండ్ బి, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలోని హెలిప్యాడ్, జెఎన్‌టియుకెలో గెస్ట్ హౌస్, సభా వేదిక వద్ద ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ పరేడ్ మైదానం నుంచి జెఎన్‌టియుకె వరకు కాన్వాయ్, ఇతర భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టరు వెంట రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.సుమలత, రెక్టార్ కెవి.రమణ, ఆర్ అండ్ బి ఎస్ఇ కె.హరిప్రసాద్ బాబు, డిఎస్‌పి అప్పారావు, కాకినాడ ఆర్‌డిఒ బివి.రమణ, కాకినాడ అర్బన్, రూరల్ తహసీల్దార్లు సీతాపతిరావు, మురార్జీ పాల్గొన్నారు.

సత్రంలో సౌకర్యాలపై విజ్ఞప్తి

ప్రజాశక్తి అన్నవరం

అన్నవరం కొండ దిగువున దేవస్థానానికి సంబంధించిన పబ్లిక్ ఎలిమినేషన్ (పిఎసి) సత్రంలో సౌకర్యాలు కల్పించాలని ఎన్.శ్రీనివాస్ డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో సూచించారు. కొండపైన సోమవారం దేవస్థానం ఇఒ ఆజాద్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఫిర్యాదులు, సూచనలు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన ఇఒ ఆజాద్ తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు

31న ఇంటర్ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఈ నెల 31న ఇంటర్ కమిషనర్ కు వినతి కార్యక్రమానికి రాష్ట్రంలోని కాంట్రాక్ట్ లెక్చరర్స్ అందరు రావాలని ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ గొర్ల మాణిక్యం పిలుపునిచ్చారు. గత నాలుగేళ్లుగా ఇస్తున్నట్టే ఈ సంవత్సరం ఏప్రిల్, మేకు సంబంధించిన జీతాలు ఇవ్వాలన్నారు. ఈ సంవత్సరం కోత విధించడం వల్ల కాంట్రాక్టు ఉద్యోగులు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ విషయమై ఈ నెల 31న వినతిపత్రం అందించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.

దేశంలో అతి పెద్ద కార్మిక సంఘం సిఐటియు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

దేశంలోనే అతి పెద్ద కార్మిక సంఘం సిఐటియు అని సంఘ: మండల ఉపాధ్యక్షులు కరణం ప్రసాదరావు చెప్పారు. స్వాతంత్ర్యం రావడానికి 27 ఏళ్ల ముందే కార్మిక సంఘం ఏర్పడిందన్నారు. సిఐటియు వ్యవస్థాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం మాధవపట్నం సెంటర్లో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ప్రసాదరావు మాట్లాడారు. తొలుత సిఐటియు పతాకాన్ని లోవ బాబు ఆవిష్కరించారు. అనంతరం కరణం ప్రసాదరావు మాట్లాడుతూ 1920లో ఏర్పాటైన సిఐటియు సాధించిన కార్మిక విజయాలను వివరించారు. సంఘం ఆధ్వర్యంలో రాబోవు రోజుల్లో కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు బాలం శ్రీనివాస్, మాధవపట్నం నాయకులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న కరణం ప్రసాదరావు

కరాటే పోటీల్లో ఎపి జట్టుకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విశాఖపట్నం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ద్వితీయ స్థానం లభించిందని కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌ఛార్జి డి.శంకరరావు తెలిపారు. ఇండోనేషియా ఇంటర్నేషనల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తాను రాష్ట్రం తరుపున 91 మంది విద్యార్థులను తీసుకెళ్లినట్టు చెప్పారు. తమ విద్యార్థులు అధిక శాతం ఉత్తమ పతకాలను సాధించడంతో పాటు రెండో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్టు చెప్పారు. గుజరాత్ మొదటి ఓవరాల్ ఛాంపియన్ సాధించిందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ కరాటే పోటీల్లో ఎన్నడూ లేని విధంగా ఇంటర్నేషనల్ స్థాయిలో తమ విద్యార్థులు ప్రతిభను కనబరచడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు, కరాటే కోచ్‌లు, శంకరరావుకు లయన్స్ క్లబ్ నాయకులు చిత్తులూరి వీర్రాజు (రాజా), ఈదల ఈశ్వర కుమార్, మేకా శ్రీనివాసు, మద్దిరాల శివనాగకృష్ణ, భారత్ మాతా సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్య దొర అభినందనలు తెలిపారు.

ఛాంపియన్‌షిప్ అందుకుంటున్న విద్యార్థులు

ఉత్తమ వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి- రౌతులపూడి

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ వాలంటీర్లకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, వైస్ ఎంపిపి తిరుమల రాయలు, ఎంపిడిఒ గోవింద వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పి.వేమవరంలో ఊరికి ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్ మార్చాలని మాగాపు గణపతి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో స్పందనలో ఫిర్యాదు చేసారు. విచారణ జరిపి ఊరికి దూరంగా మార్చాలని ఆయన కోరారు. గ్రామంలో డ్రైనేజీ పరిస్థితి అసలు బాలేదని డ్రెయిన్‌ల నిర్వహణ సరిగా చేపట్టాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని కాకినాడ డిఎల్‌పిఒ అమ్మాజీ హామీ ఇచ్చారన్నారు.

సిసిఆర్‌సి కార్డుల అందజేత

ప్రజాశక్తి-కాజులూరు

అర్హులైన కౌలు రైతులందరికీ సిసిఆర్సి కార్డులు అందజేస్తామని గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద కౌలు రైతులకు కార్డులు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసన్న మౌనిక మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతుల కోసం అనేక పథకాల ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ ఈశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరాల్లో భాగంగా సోమవారం పలు అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కన్వీనర్ బుద్దా శ్రీనివాస్ క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ జీవిత విశేషాలపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులకు పాటలు పాడటంలో శిక్షణ ఇచ్చారు. సాయంత్రం నృత్య రూపకాల ప్రదర్శనలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులందరికీ కొల్లి దుర్గాప్రసాద్ స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కో ఆర్డినేటర్ రొంగల అరుణ్, కూనిరెడ్డి అరుణ, దారపురెడ్డి కృష్ణ, అమత, నమ్రత, రవికుమార్, సందీప్, ఐశ్వర్య, సూరజ్ పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఉపాధ్యాయిని వాడపల్లి విమలారాణి విద్యార్థులకు సంగీత స్వరాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు పాల్గొన్నారు. **తాళ్లరేవు** సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులకు ఆహ్లాదం, ఆనందమే కాక సజనాత్మకత వస్తుందని జెవివి నాయకులు శ్రీరామ్ అన్నారు. వారం రోజులుగా తాళ్ళరేవు ప్రజాసంఘాల ఆఫీసు వద్ద నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు కార్యక్రమానికి శ్రీరామ్ సోమవారం పిల్లలకు మ్యాజిక్ షో, కాగితాల ద్వారా వస్తువులు తయారు చేయడం తదితర విషయాలను నేర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, తణుకు రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు, సీతారామపురం గ్రామానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మానవ జీవితం ఒక సైన్స్ ప్రయోగశాల అని రాజమండ్రి జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కన్నూరి సతీష్ బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా ఆయన హాజరై సైన్స్ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ పాలకులు కవికొండల సత్యనారాయణ వివిధ పాఠశాల విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం, కరప

పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు జూన్ 9వ తేదీలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఒసిలకు కేటాయించిన 5వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రం, అదే మండలం ఎస్ఆర్.పాలెంలో బిసి బిలకు కేటాయించిన 3వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి స్థానికులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 21 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరప మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసిడిఎస్ తాళ్లరేవు ప్రాజెక్ట్ అధికారి వి.మాధవి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూన్ 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు లోపు పరిశీలన నిమిత్తం ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పోలీస్ స్పందనకు 56 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ స్పందనకు 56 అర్జీలు వచ్చాయని ఎస్పీ తెలిపారు. కుటుంబ తగాదాలు, సివిల్ వివాదాలతో పాటుగా ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందాయని, ఎస్‌పి తెలిపారు. ఎఎస్‌పి పి.శ్రీనివాస్, డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో స్పందన..

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల వినతులు స్వీకరించారు టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, సహా వివిధ విభాగాలకు సంబంధించి వినతులు అందజేశారు. ఆయా విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న వివిధ విభాగాధిపతులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, స్మార్ట్ సిటీ ఎస్ఇ సత్య కుమారి, ఇఇ వెంకట్రావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాసరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఒ కృష్ణమోహన్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

పెద్దాపురంలో 9 అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు సమస్యల పరిష్కారం కోరుతూ 9 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ స్పందన అర్జీలన్నీ ఆయా కార్యాలయాల అధికారులకు పంపించి వేగవంతంగా సమస్యలు పరిష్కరించి అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించామన్నారు.

కార్టూ'నిజం'

మనల్ని మాత్రం ఎవరూ దత్త పుత్రులుగా స్వీకరించట్లేదురా..!!

విద్యుత్ శాఖకు రూ.50 లక్షల నష్టం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్, రౌతులపూడి

సామర్లకోట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం సాయంత్రం వీచిన విపరీతమైన గాలులు, పిడుగుపాటులు, వర్షం దాటికి విద్యుత్ శాఖకు రూ.50 లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు సామర్లకోట ఎపి ట్రాన్స్‌కో ఎడిఇ చెప్పారు. సామర్లకోట, సామర్లకోట రూరల్, పెద్దాపురం, పెద్దాపురం రూరల్ పరిధిలలో సుమారు 60 విద్యుత్ స్తంభాలు ధ్వంసం కాగా, అయిదు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు పాడైనట్టు చెప్పారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు 80 శాతం పునరుద్ధరణ పనులు పూర్తి చేశామని, మరలా వర్షం కురవడం వల్ల పనులకు అంతరాయం ఏర్పడిందని ఎడిఇ వివరించారు.

చంద్రంపాలెంలో విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

పునరుద్ధరణ పనులలో తీవ్ర జాప్యం

పునరుద్ధరణ పనుల్లో తీవ్ర జాప్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం రోజంతా కరెంటు సరఫరా నిల్చిపోగా సోమవారం ఆరు గంటలు దాటినా పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ లోగా మరలా మెరుపులు, ఉరములు, పిడుగుపాటులతో వర్షం కురియడంతో పనులకు అంతరాయం ఏర్పడినట్లయ్యింది. ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు కారణంగా సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాలలో చెట్లుకూలడం, విద్యుత్ స్తంభాలు విరిగిపడడం, విద్యుత్ లైన్ లు ఛిద్రం కావడం వంటి సంఘటనల నుంచి ప్రజలకు మెరుగైన సేవలను అందివ్వడం లోనూ, పునరుద్ధరణ పనులు సత్వరం చేపట్టడంలో ఆయా శాఖల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ఎడిఇ కిరణ్ పర్యవేక్షణలో అర్బన్, రూరల్ ఎఇలు రమేష్ కుమార్, కృష్ణ లైన్ ఇన్స్‌పెక్టర్లు పనులను పర్యవేక్షిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో నాలుగిళ్లు దగ్ధం

రౌతులపూడి మండల కేంద్రమైన రౌతులపూడిలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో నాలుగిళ్లు దగ్ధమయ్యాయి. కొప్పుల రామయ్యమ్మ, కొప్పాల శ్రీను, బీజా సత్తిబాబు, దమ్ము కిషోర్ కు చెందిన ఇళ్లు దగ్ధమయ్యాయి. ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మధు, సర్పంచ్ అర్జమ్మ, ఉప సర్పంచ్ భాస్కర్‌బాబు, వైసిపి మండల అధ్యక్షుడు శ్రీను, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బాధిత మహిళతో మాట్లాడుతున్న పోలీసులు

న్యాయం కోసం మహిళ ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తనను వేధిస్తున్న పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని, తనకు న్యాయం చేయాలని అమలాపురం గొల్లగూడెంకు చెందిన వాసి ఆరుద్ర తన వికలాంగురాలైన కుమార్తెతో కలిసి కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. తన కుమార్తె అనారోగ్య సమస్యలతో ఇల్లు అమ్ముకుంటే ఇద్దరు కానిస్టేబుల్స్ వేధిస్తున్నాడని ఆమె తెలిపారు. స్పందనలో ఫిర్యాదు చేసినా తనకు న్యాయం చెయ్యలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఆమెను తన ఛాంబర్ వద్దకు తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

పిడుగు పడి రైతు కూలీ మృతి

ప్రజాశక్తి-పిఠాపురం

అర్జునరావు మృతదేహం

పిడుగు పడి రైతు కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని భోగ్గ వరంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ జి.సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి కట్టమూరి అర్జున్ రావు (41) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి వేసిన గాలివానకు పిడుగు పడి అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అర్జున్ రావు మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

సుధాకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గోదావరిలో ఈతకు వెళ్లి యువకుడు మృత్యువాత

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి వద్ద గోదావరిలో స్నానానికి దిగిన యువకుడు మత్యువాత పడ్డాడు.కోటిపల్లి ఎస్సై పేటకు చెందిన కొండట్టు సుధాకర్ (28) స్నానం చేసేందుకు గోదావరిలో దిగాడు. కొంత దూరం ఈత కొట్టిన తర్వాత ఆయాసపడి మునిగిపోయాడు. స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం మతదేహం లభ్యమయింది. మృతునికి తల్లిదండ్రులు భార్య ఉన్నారు. ఇన్‌ఛార్జి ఎస్ఐ ఆచార్యులు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ఒక రెస్టారెంట్‌లో కూలి పని చేసే రాగంపేట గ్రామానికి చెందిన గొడ్డ సత్యవతి (39) పని ముగించుకుని రెస్టారెంట్లో పని చేసే అబ్బాయి బైకుపై ఇంటికి వెళుతుండగా బైకు పైనుంచి జారిపడి గాయపడింది. కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు గండేపల్లి ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు.

లారీని తప్పించబోయి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలైన ఘటన స్థానిక అచ్చంపేట పిజి కాలేజ్ తిమ్మాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకొంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు సామర్లకోట మండలం జి.మేడపాడుకు చెందిన ఎదిద సూర్యనారాయణ (33) ఉద్యోగ రీత్యా రమణయ్యపేట మురళీధర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. స్నేహితుడిని సామర్లకోట స్టేషన్‌లో దింపి వస్తుండగా లారీని ఓవర్ టేక్ చేస్తూ బ్యాక్ టైర్లో పడిపోయారు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. తిమ్మాపురం ఎస్ఐ కేసు విచారణ చేపట్టారు.

ఫోన్‌లో వేధింపులపై మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి-కడియం

ఫోన్‌లో వేధింపులపై వేమగిరికి చెందిన ఒక మహిళ దిశ ఎస్ఒఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. కొన్ని రోజుల క్రితం గుర్తు తెలియని నెంబర్ నుంచి తనకు రూ.2 వేలు ఫోన్‌పే ద్వారా వచ్చాయన్నారు. వెంటనే అదే నెంబరుకు ఆ మొత్తాన్ని తిరిగి పంపేశానన్నారు. అప్పటి నుంచి అదే నెంబర్ నుంచి వాట్సప్ కాల్ చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. అడిగినంత డబ్బులు చెల్లించాలని, లేకుంటే ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు. అంతేకాకుండా మార్ఫింగ్ చేసి న్యూడ్ ఫోటోలను తనకు పంపుతున్నారన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోన్ నెంబర్ ఆధారంగా విచారణ చేపట్టారు. అజ్ఞాత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి వేధింపులకు పాల్పడితే వెంటనే దిశ ఎస్ఒఎస్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కన్నబాబు

'మ్యానిఫెస్టోను కాపీ చేసిన చంద్రబాబు నాయుడు'

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పక్క రాష్ట్రంలో విజయం సాధించిన పార్టీ మేనిఫెస్టోను కాపీ చేసి రాజమహేంద్రవరం మహానాడులో వల్లించారని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిడిపి మేనిఫెస్టోపై కన్నబాబు విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు సుభిక్షమైన పాలనలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలందరూ టిడిపిని ఎప్పుడో మరిచిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ఘోరమైన పరాభవం తప్పదన్నారు. చంద్రబాబు కేసులు, మాటల వల్ల ప్రజలు ఆయనను దూరం పెట్టారని విషయాలు గుర్తించాలన్నారు. 2014 తెలుగుదేశం మేనిఫెస్టోలో 650 అంశాలు పొందుపరిచారని కనీసం అందులో పది అంశాలు కూడా అమలు చేయలేదన్నారు. దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 32 లక్షల మందికి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించే బాధ్యత చేపట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల ఆరాధ్య దైవమన్నారు.

మాజీ ఎంఎల్ఎ దొమ్మేటి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు మాజీ ఎంఎల్ఎ దొమ్మేటి వెంకటేశ్వర్లు (60) కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించారు. 1999లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వెంకటేశ్వర్లు విజయం అంచుల వరకు వచ్చి ఓటమి పాలయ్యారు. సుమారు ఐదుసార్లు ఎంఎల్ఎగా పోటీ చేసి ఓటమి చెందినా, 2004లో ఎంఎల్ఎగా విజయం సాధించారు. తన పరిపాలనా కాలంలో గొర్రెపూడి జి.వేమవరం ఎత్తిపోతల పథకం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించారు. పెద్ద సంఖ్యలో సామూహిక వివాహాలు జరిపించి పేదల దంపతులకు మంగళసూత్రాలు, పట్టు వస్త్రాలు అందజేశారు. ఎవరికి ఆపద వచ్చినా తానున్నానంటూ ఆదుకునేవారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. కాకినాడ రూరల్ ఎంఎల్ఎ అభ్యర్థిగా సీటు దక్కినా అనివార్య కారణాల వల్ల ఆ సీటు నులుకుర్తి వెంకటేశ్వరరావుకు కేటాయించడంతో తాను పోటీ నుంచి తప్పుకున్నారు. అనంతరం వైసిపిలో చేరినప్పటికీ టికెట్ కేటాయించకపోవడంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్న దొమ్మేటి సోమవారం రాత్రి ఆకస్మాత్తుగా మరణించారు.

దళిత యువకుని హత్యపై విచారణకు ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన దళిత యువకుడు ఏసుగుపల్లి అప్పన్న హత్య కేసులో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ధర్నా చౌక్ వద్ద బాధితులు, బంధువులు ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజబాబు మాట్లాడుతూ పిఠాపురం సిఐ నిర్లక్ష్య వైఖరిని నిరసించారు. హత్య కేసులో నిందితుడైన పిఠాపురం మండలం విరవ గ్రామానికి చెందిన బోను బాబ్జిపై అట్రాసిటీ, హత్య నేరం కేసులు నమోదు చేయాలన్నారు. హత్య జరిగి ఆరు నెలలు గడిచినా దోషులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కేసును తారుమారు చేసి బోను బాబ్జిని తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తక్షణమే బాబ్జిని అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్‌పికి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఎస్‌పి స్పందిస్తూ తానే స్వయంగా విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి కడితి సతీష్, నాయకులు నారాయణరావు, వర్ధనపు శివాజీ, రంప ఏసమ్మ, సులోచన, వెంకటరత్నం పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

రూరల్ ఎంఎల్ఎ కన్నబాబు ర్యాలీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 32 లక్షల మందికి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించే బాధ్యత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టారని వైసిపి జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఎ కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం కాకినాడ రూరల్ వైద్య నగర్‌లో తన నివాసం నుండి సర్పవరం జంక్షన్ మీదుగా తిమ్మాపురం జగనన్న కాలనీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఎ కన్నబాబు మాట్లాడుతూ చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే వాటిని సమాధులతో కట్టుకోవడానికి అనడంపై పేదలంతా ఎంత చులకనో తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను నిర్వహించి పేదలకు మధ్యతరగతి సామాన్యులకు అందించారన్నారు. రాష్ట్రంలో 15 వేల పంచాయతీలలో ఒంటి జగనన్న కాలనీలు 17,000 ఉన్నాయని తెలిపారు. అనంతరం జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. ఒక బైక్ ర్యాలీలో ఎంఎస్ చైర్మన్ గీసాల శ్రీను, ఎంపిపిలు గోపిశెట్టి పద్మజా బాబ్జి, పెంకె శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంపన రామకృష్ణ, కోరాడ దుర్గాప్రసాద్, గీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ఎ కన్నబాబు

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి

ప్రజాశక్తి - తాళ్లపూడి

పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించాలని డిపిఒ జగదాంబ అధికారులను సూచించారు. సోమవారం తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాధికతో కలిసి స్పందనలో పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. పన్నులు వసూళ్ళ 80 శాతం పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులతో మురికి ఉన్న కోర్టు వ్యవహారాలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కోసం జిల్లాలో 45 ప్రాంతాలకు మ్యాపులు వచ్చాయని ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులను ఆదేశించామని తెలిపారు.

సబ్ ప్లాన్ నిధులు రీ షెడ్యూల్ చేయాలి

ప్రజాశక్తి-గండేపల్లి

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం నిధులు రూ.25 వేల కోట్లు రీ షెడ్యూల్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరోతి శివ గణేష్ సోమవారం నీలాద్రిరావుపేట అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 1982లోనే ద్వాక్రా పథకాన్ని ఇందిరాగాంధీ ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కర్ణాటకలో అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పథకాలను కాపీ కొట్టి టిడిపి మ్యానిఫెస్టోలో పెట్టిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వత్సవాయి సత్యనారాయణ రాజు, డాక్టర్ నక్కా సత్యనారాయణ, అవసరాల వేంకటాచల సుధాకర్, గొంపా కొండబాబు, చంద్రమౌళి, వెంకటరత్నం, కాకి జయ, యాళ్ల కుమార్, తంగెళ్ల గణేష్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-జగ్గంపేట

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. జగ్గంపేట కేంద్రంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం వారపు సంతలో భూపాలపట్నం సర్పంచ్ వీరం రెడ్డి కాశిబాబు ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో పాల్గొన్న జ్యోతుల నవీన్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ రద్దు చేసిన ఈ ప్రభుత్వానికి కళ్ళు తెరిపించేందుకు జగ్గంపేటలో ప్రతి సోమవారం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఈ అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతిర్లింగం కుమార్, ఎస్‌వివిఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, వీరంరెడ్డి కాశిబాబు, కొత్త కొండబాబు, బొండా రాజేష్, ఎండి కాజా, వేములకొండ జోగారావు, నేదూరి గణేష్, దేగల సత్తిబాబు, కోమిరి రమేష్, వైశ్యుల కొండబాబు యాదవ్, తుమ్మల కిషోర్, మారిశెట్టి గంగ, కొండ్రోతు శ్రీను, కురుమళ్ల నాగేశ్వరరావు, పలివెల ఏసు రాజు, పంపనబోయిన అప్పాజీ, గొంతిన బాబ్జి, ఆదినారాయణ పాల్గొన్నారు.

యానాం వార్తలు

31 నుంచి మెగా కంటి వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలో మూడు ఉచిత మెగా కంటివైద్య శిబిరాలను ఈ నెల 31 నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు వీటిని ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. ఈ శిబిరాల్లో భాగంగా రోగులకు ఉచిత వైద్యపరీక్షలు, క్యాటరాక్ట్ ఆపరేషన్లు, కళ్లజోళ్లు, మందులు సైతం ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ నెల 31న గిరియంపేట కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్, జూన్ 2న దరియాలతిప్ప కెఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్, 4వ తేదీన కనకాలపేట కెవిఎస్ ప్రభుత్వ హైస్కూల్లో కంటివైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పిడబ్ల్యూడి ఇఇగా వీరసెల్వం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి) నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కె.వీరసెల్వం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం పిడబ్ల్యూడి అధికారులు ఘనంగా ఆహ్వానించి,శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ఎఒకు శ్రీలు సత్కరిస్తున్న ఇఇ వీర సెల్వం

నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి, తదితరులు

బాపనయ్య నాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

మేయర్‌గా పని చేసిన బెజవాడ బాపనయ్య నాయుడు వర్ధంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ షణ్ముగం, మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, బెజవాడ నిరంజన్, బాపనయ్య నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాబు ప్రవేశపెట్టింది మాయాఫెస్టో : మంత్రి వనిత

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్, ధవళేశ్వరం

చంద్రబాబు ప్రవేశపెట్టింది మ్యానిఫెస్టో కాదు... మాయా ఫెస్టో అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడారు. ప్రజలను మభ్య పెట్టడం చంద్రబాబు వైఖరి అన్నారు. 98 శాతం హామీలను నెరవేర్చింది వైసిపి ప్రభుత్వమేనన్నారు. పంగిడిలో మంత్రి వనిత జెండా ఊపి ర్యాలీ కార్యక్రమం ప్రారంభించారు. పంగిడి నుంచి కావవరం, ధర్మవరం, పెనకనమెట్ట, దొమ్మేరు గ్రామాల మీదుగా కొవ్వూరు పట్టణంలో ప్రధాన మార్గాల గుండా మంత్రిత్వాపు కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ధవళేశ్వరంలో వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. భారీ వర్షం పడుతున్నా లెక్కచేయకుండా కార్యకర్తలు ఉత్సాహంగా ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

సత్కార సభకు వాలంటీర్ల గైర్హాజరు

ప్రజాశక్తి-తాళ్లరేవు

తాళ్లరేవులో సోమవారం నిర్వహించిన సత్కార సభకు హాజరు కాని వాలంటీర్లు సరైన కారణాలు చూపకపోతే తొలగించాలని ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ ఆదేశించారు. సూర్య భాస్కర కళ్యాణ మండపంలో మండల స్థాయి వాలంటీర్ల సత్కార సభ ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు సుమారు 92 మంది వరకు వాలంటీర్లు డుమ్మా కొట్టడంతో ఎంఎల్ఎ పొన్నాడ ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన సేవలకు సత్కారం చేసి అభినందించాలని సభ ఏర్పాటు చేస్తే వాలంటీర్లు అందరూ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తక్షణం అందరికీ షోకాజ్ నోటీసులు అందజేసి సరైన సమాధానం ఇవ్వకపోతే తక్షణం తొలగించాలని ఎంపిడిఒ అనుపమను ఆదేశించారు. అనంతరం హాజరైన వాలంటీర్లను గ్రామవారీ సత్కరించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా సేవ చేస్తున్న వాలంటీర్లను గుర్తించి సత్కరించడం ప్రభుత్వ గొప్పతనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్‌పిటిసి దొమ్మేటి సాముయేల్ సాగర్, జెడ్‌పి మాజీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, వైసిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందా కుమార్, రాయుడు గంగాధర్, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు టిల్లపూడి నాగేశ్వరరావు, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి, పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పొన్నాడ

వాలంటీర్లకు ఘన సన్మానం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపఎర్రంపాలెం పంచాయతీ కార్యాలయంలో వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు ఆధ్వర్యంలో వాలంటీర్లను సోమవారం ఘనంగా సత్కరించారు. సేవా మిత్ర పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గోకవరం మండలం సచివాలయం కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సూరా రెడ్డి గోకవరం టౌన్ ప్రెసిడెంట్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరసాల ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వాలంటీర్లకు నగదు పురస్కారాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తొట్ట సత్యనారాయణ, డి.వెంకటరత్నం, ఎ.వెంకటేశ్వరరావు, పాటి అప్పలరాజు, కె.శివరామకృష్ణ, పి.సత్యానందం, పంచాయతీ కార్యదర్శి గోపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజ్ వైర్లు

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద సీతానగరం నుండి మెర్నిపాడు వెళ్లే మెయిన్ రోడ్డు కాలువ చెంతన, పాలతోడు - వెలగతోడు మెయిన్ రోడ్లులోని పొలాలోను ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజ్ వైర్ల రక్షణ వలయం లేకపోవడంతో ప్రమాదాలను తలపిస్తోంది. ఈ వైర్లు చేతికి అందేంత ఎత్తులో ఉన్న నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్ తీగలకు రక్షణ వలయం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

సీతానగరంలో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్లు

పాలతోడులో ..

రంపఎర్రంపాలేనికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామానికి ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వైసిపి కన్వీనర్ పాటి రాంబాబు అన్నారు. గ్రామానికి చెందిన పలువురికి ఉన్నత పదవులు అందించారన్నారు. వైసిపి మండల అధ్యక్షునిగా పాటి రాంబాబు, తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులుగా కర్రి వెంకటశివరామకృష్ణ, గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా పెమ్మగొండ సత్యానందం, తంటికొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా పాటి సూర్యనారాయణ, గోకవరం సొసైటీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా తొట్ట సత్యనారాయణలకు పదవులను ఇప్పించారన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జ్యోతులకు కృతజ్ఞతలు తెలిపారు. కర్రి శివరామకృష్ణ, పెమ్మగొండ సత్యానందంలను గోకవరం మండలం సచివాలయాల కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాలప్రసాద్, గోకవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సూరారెడ్డి, గోకవరం టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్‌లతో కలిసి రాంబాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తొట్ట సత్యనారాయణ, పాటి అప్పలరాజు, అడపాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-కొత్తపేట

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమనిమండల టిడిపి అధ్యక్షుడు..కంఠంరెడ్డి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో నియోజకవర్గంలో ప్రజలు బాగోగులను గాని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు గాని వైసిపి నేతలకు పట్టలేదని విమర్శించారు. మహిళలు, యువత, రైతులు భవిష్యత్తుకు మహానాడులో చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో ప్రకటనతో ప్రజలకు భరోసా కలిగించారు. సమావేశంలో అవిడి మాజీ సర్పంచ్ ముత్యాల బాబ్జి, సర్పంచ్, ఇన్‌ఛార్జ్ రెడ్డి తాతాజీ, కొత్తపేట మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు, వానపల్లి ఉప సర్పంచ్ గనిశెట్టి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జలజీవన్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేయనున్న తాగునీటి ట్యాంక్ పనులకు నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు సోమవారం భూమి పూజ చేశారు. ఉండ్రాజవరంలో వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ట్యాంకు నిర్మాణ స్థలం వద్ద శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. ఆర్.కె.నగర్ కాలనీలో రూ.5.82 కోట్లతో 2లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును నిర్మిస్తున్నామన్నారు. తొందరలోనే నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు ఉచితంగా తాగునీటిని అందిస్తామని తెలిపారు. అనంతరం ఉండ్రాజవరం గ్రామ సచివాలయం-1, వెల్నెస్ సెంటర్-1, సచివాలయం-3 భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, జెడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కరరామయ్య, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి సూర్య వెంకటమంగాదేవి సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంపిడిఒ శ్రీనివాస్, తహశీల్దార్ జి.కనకరాజు, డిఇ టి.శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ నాయుడు

అన్నదాతలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కడియం

కడియం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గ్రంథాలయ సభ్యులు ఉప్పులూరి చిట్టిబ్బాయి విద్యార్థులకు వ్యవసాయం, రైతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయం దైవంతో సమానం అన్నారు. రైతులే దేశానికి వెన్నుముక అని వివరించారు. అనంతరం విద్యార్థులకు కథలు, క్రాఫ్ట్‌లు నేర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీదేవినిర్మల, వెంకటేశ్వర్లు, రవితేజ, కె.ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పిఠాపురం మండలం, కోలంక గ్రామానికి చెందిన ముంజవరపు రాజేష్ కుమార్, తండ్రి: సన్యాసిరావు (లేటు) గారికి చెందిన పాస్‌పోర్ట్ నెం. F3305565 పాస్‌పోర్టు పోగొట్టుకున్నారు. అధికారులచే జారీ చేయబడిన సదరు పాస్‌పోర్టును అడ్రసు మార్పుకొరకు రెన్యువల్ చేయుట నిమిత్తం హైదరాబాదు వెళుతూ కోలంకలోని మా ఇంటి దగ్గర నుండి పిఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జిరాక్సు నిమిత్తం వెళుచుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

ముంజవరపు రాజేష్ కుమార్
తండ్రి: సన్యాసిరావు (లేటు), డో.నెం.3-8,
కోలంక, పిఠాపురం మండలం.
సెల్: 77802 72521

కాకినాడ నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి.నెం.2679/2017/F3 తేది.29-05-2023

షార్టు టెండరు నోటీసు

కాకినాడ నగరపాలక సంస్థ నగరములో జోన్-1 లోని వివిధ వార్డులలో ప్రభుత్వం మరియు ప్రైవేట్ ఖాళీ స్థలములలో గుర్తించిన సుమారు 445 ఖాళీస్థలములలో చెత్త మరియు వ్యర్థములను తొలగించుటకు మరియు ఖాళీస్థలములను శుభ్ర పరుచుటకు గాను 50 మంది పనివారిని 13 రోజులు పాటు పనికి ఏర్పాటు చేయుటకు గాను అర్హత కలిగిన కాంట్రాక్టర్ల నుండి టెండరు పిలువడమైనది. సదరు టెండర్లు ది.03-06-2023 సాయంత్రం గం॥ 4:00 ల వరకు స్వీకరించి అదే రోజు గం॥ 4:30 నిలకు టెండర్లు తెరువబడును. టెండరు షెడ్యూల్ ఖరీదు మరియు ధరావత్తు చెల్లించుటకు ఆఖరు తేది. 02-06-2023.

వ.నెం.	వివరములు	అంచనా మొత్తం రూ.	ధరావత్తు రూ.	టెండరు షెడ్యూల్ ఖరీదు రూ.
1.	కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో జోన్-1 లోని వివిధ వార్డులలో గుర్తించిన సుమారు 445 ఖాళీస్థలములలో చెత్త మరియు వ్యర్థములను తొలగించుటకు మరియు ఖాళీస్థలములను శుభ్రపరుచుటకు గాను 50 మంది పనివారిని 13 రోజులు పాటు పనికి ఏర్పాటు చేయుటకు పనివారికి రోజుకి రూ.612/- చొప్పున 50 పనివారికి ఏర్పాటు చేయుటకు (612/-×50×13 రూ.3,97,800/-)	రూ.4,69,404/- (GST18% తో కలిపి రూ.71,604/-)	రూ.11735/-	రూ.1000/- రూ.180/- VAT

ఇతర విషయములు ఆఫీసు పనివేళల యందు ప్రజారోగ్య విభాగము నుండి తెలుసుకొనవచ్చును.
సం/- కమీషనరు, నగరపాలక సంస్థ, కాకినాడ